# సాక్షి ప్రకాశం

గురువారం । 16 । జనవరి । 2025




**అనుమానంతో అంతమొందించాడు**

భార్య ఇతరులతో చనువుగా ఉంటుందన్న అనుమానంతో భర్తే ఆమెను హత్యచేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు.

- 8లో..



**విద్యుదాఘాతంతో రైతు మృతి**

పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన పొదిలి మండలం జువ్వలేరులో జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30/22

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### వ్యక్తిని చూసి వ్యక్తిత్వం, పెంపకం ఏంటో చెప్పవచ్చు

● సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత



బాలలతను సన్మానిస్తున్న మలినేని గోపీచంద్

ఒంగోలు సిటీ: ఒక వ్యక్తిని చూసి వ్యక్తిత్వం, పెంపకం ఏంటో చెప్పవచ్చని సివిల్స్ మెంటార్, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత అన్నారు. ఒంగోలు మండల పరిధిలోని ఉలిచి గ్రామంలో మంగళవారం ఉలిచి అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో సివిల్స్ మెంటార్, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత ను ముఖ్య అతిథిగా సినిమా డైరెక్టర్ మలినేని గోపిచంద్ పాల్గొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సివిల్స్ మెంటార్, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఎన్నో సన్మానాలు జరిగినా ఉలిచి గ్రామంలో మీముందు జరిగే ఈ సన్మానం నా మనస్సులో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుందని, దానికి కారణం మీ అందరి ప్రేమాభిమానాలన్నారు. కార్యక్రమంలో ఉలిచి అభ్యుదయ సేవా సమితి సభ్యులు గార్లపాటి రామారావు, చుంచు నాగేశ్వరరావు, బొద్దులూరి రామారావు, చప్పిడి రవీంద్ర బాబు, ఉప్పలపాటి శ్రీనివాసరావు, చేజర్ల వెంకటరావు, బీ హనుమంతరావు పాల్గొన్నారు.

### ఉల్లాసంగా మహిళా బీచ్ కబడ్డీ పోటీలు



తలపడుతున్న గుంటూరు-బాపట్ల జట్లు

ఒంగోలు సిటీ: జాతీయ స్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలు ఒంగోలు మండల పరిధిలోని కరవదిలో బుధవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను వైద్యుడు రేవూరి మల్లిఖార్జునరావు, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి మాజీ జాతీయ క్రీడాకారుడు పీవీ రంగారావు అధ్యక్షత వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా బీచ్ కబడ్డీ క్రీడాకారులను తాలూకా సీఐ అజేయ్ బాబు, వివేకానంద కరస్పాండెంట్ రఘుప్రదీప్‌లు పరిచయం చేసుకున్నారు. లీగ్ పోటీల్లో గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల మహిళా బీచ్ కబడ్డీ జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, కోశాధికారి డీ రమేష్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గడ్డం శ్రీనివాసరావు పాల్గొన్నారు.





ఒంగోలు గాంధీపార్క్‌లో తెప్పోత్సవంలో ప్రసన్న చెన్నకేశవస్వామి, (ఇన్‌సెట్‌లో స్వామి వారి ఉత్సవమూర్తి)



ఒంగోలు గద్దలగుంటలో పార్వేట తిలకించేందుకు వచ్చిన భక్తజనం

## ఊరంతా సంబరం

సంక్రాంతి, కనుమ వేడుకలను జిల్లాలో కన్నుల పండువగా నిర్వహించారు. ఒంగోలులో కనుమ సందర్భంగా బుధవారం పార్వేట ఉత్సవం ఘనంగా జరిగింది. వివిధ ఆలయాల నుంచి దేవతామూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. వేలాది మంది పార్వేటలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. పలుచోట్ల తెప్పోత్సవాలు నిర్వహించారు. - సాక్షి, ఒంగోలు

# రేషన్ దందాలో కూటమి కేటుగాళ్లు



ఉప్పుగుండూరులోని మణికంఠ రైస్ మిల్లులో గత నెల 6న పట్టుబడిన 2,500 బస్తాల రేషన్ బియ్యం (ఫైల్)

**పేదలకు అందాల్సిన** రేషన్ బియ్యం కూటమి నేతలకు కాసులు కురిపిస్తోంది. నియోజకవర్గ స్థాయి నేతల నుంచి గ్రామ స్థాయి నేతల వరకు తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు పంచుకు తింటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు పక్కా ప్రణాళికతో అధికార బలంతో డీలర్లను తొలగించి అనుయాయులకు షాపులను కట్టబెట్టి దోపిడీకి తెరతీశారు. నిత్యం టన్నులకొద్దీ పేదల బియ్యాన్ని రేషన్ మాఫియా పక్కదారి పట్టిస్తోంది. ఇలా మూడొంతుల పేదల బియ్యాన్ని కూటమి కేటుగాళ్లు బొక్కేస్తూ..బొజ్జలు నింపుకుంటున్నారు.

- పేదల బియ్యం దోపిడీకి టీడీపీ నేతల ప్రణాళికలు
- అనుయాయులకు పేదల బియ్యం అప్పగింత
- బదులుగా స్థానిక నేతకు నెలకు రూ.40 లక్షలు పైగా నజరానా
- కార్డుదారుడి నుంచి డీలర్ రూ.10కి కొనుగోలు
- డీలర్లు రూ.13లకు పచ్చ నేత కేటాయించిన మిల్లర్, బ్రోకర్‌లకు ఇచ్చేలా హుకుం
- సదరు మిల్లర్, బ్రోకర్‌లు కేజి రూ.35 నుంచి రూ.50 వరకు విక్రయం
- అందుకు స్థానిక టీడీపీ నేతతో పాటు డివిజన్‌ల చోటా నాయకులకు నెల మామూళ్లు
- రేషన్ షాపులకు వచ్చే బియ్యంలో 80 నుండి 90 శాతం పక్కదారి

ఒంగోలు అర్బన్: కాదేదీ ఆదాయానికి అనర్హం అన్నట్లు ఉంది కూటమి ప్రభుత్వం నేతల తీరు. పేదల బియ్యాన్ని ప్రణాళికాబద్ధంగా కొల్లగొట్టేందుకు స్థానిక టీడీపీ నేత పచ్చ ప్రణాళికలు రచించాడు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని పచ్చనేతలు కాసుల పంటగా మార్చుకుని జేబులు నింపుకుంటున్నారు. అందుకు అడపా దడపా అధికారులు చేపడుతున్న దాడుల్లో టన్నుల కొద్దీ దొరుకుతున్న అక్రమ బియ్యమే నిదర్శనంగా కనపడుతున్నాయి. రేషన్ బియ్యం పక్కదారి పట్టించి కోట్లాది రూపాయలు దోచేస్తున్నందుకు కాను స్థానిక పచ్చ నేతకు నెలకు రూ.40 లక్షలు పైగా నజరానా సెట్ చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అది కూడా రేషన్ పంపిణీ ప్రారంభానికి ముందే నేతకు చెల్లించి ఆ తర్వాతే దందా చేసుకునేలా సెటిల్‌మెంట్. అంతేకాకుండా స్థానిక డివిజన్‌లో చోటా మోటా నాయకులకు సైతం రేషన్ బియ్యం ఆదాయంలో నెలకు ఇంత అని ముట్ట చెప్పేలా స్థానిక నేత హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వంలో పచ్చనేత ఆశీస్సులతో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది.

**అధికారంలోకి రాగానే దోపిడీకి ప్రణాళిక:**

కూటమి అధికారంలోకి రాగానే రేషన్ షాపులు, రేషన్ బియ్యంపై కన్నేసిన పచ్చనేతలు వెంటనే వారి ప్లాన్‌ను అమలు చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారుల ద్వారా పాత రేషన్ డీలర్లను తొలగించి వారి స్థానంలో టీడీపీ సానుభూతిపరులకు అప్పగించారు. పాత డీలర్లపై అక్రమ కేసులు, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడి రేషన్ షాపులను జిల్లాలో 90 శాతంపైగా కూటమి నేతలు కైవసం చేసుకున్నారు. ఎప్పుడూ లేని విధంగా 30 ఏళ్ల పైబడి పర్మినెంట్ రేషన్ షాపులు నిర్వహిస్తున్న డీలర్లను సైతం వదలిపెట్టలేదు. చివరకు ఎస్సీ, ఎస్టీ, ఒంటరి మహిళలను వదలకుండా రేషన్ షాపులను కబళించారు. అందుకు సివిల్ సప్లయిస్ అధికారులు, రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నేతలకు జీ హుజూర్ అంటూ అక్రమ కేసులు బనాయించి బెదిరించడంలో తమవంతు పాత్ర పోషించారు. రేషన్ షాపులు కట్టబెట్టడం పూర్తయిన తర్వాత అసలు సినిమాకు కూటమి నేతలు తెరతీశారు.

**డీలర్లు మారిన తర్వాత మొదలైన రేషన్ బియ్యం దందాలు**

రేషన్ డీలర్ల మార్పులు అయిన తర్వాత కోట్ల విలువైన పేదల బియ్యాన్ని పచ్చ నేతలు డబ్బుగా మార్చేందుకు పక్కా స్కెచ్‌తో ముందుకు సాగుతున్నారు. పేదలకు చేరాల్సిన బియ్యం అడ్డదారిలో వ్యాపారం చేస్తున్నారు. లక్షల కేజీల్లో పేదల బియ్యాన్ని డబ్బుగా మార్చుకునేలా నెట్‌వర్క్ నడుపుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూలై నెల నుంచి ఇప్పటి వరకు అక్రమ రేషన్ బియ్యంకు సంబంధించి 100కు పైగా రేషన్ షాపులు, అక్రమ రవాణా వాహనాలు, రైస్‌మిల్లులపై దాడులు నిర్వహించి 6ఏ కేసులు నమోదు చేశారు. దీన్నిబట్టి కూటమి నేతల అక్రమ రేషన్ దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థమవుతోంది. ప్రతి రేషన్ షాపునకు ఆయా ప్రాంతాలను బట్టి 6 టన్నుల నుంచి 15 టన్నుల వరకు బియ్యం సరఫరా అవుతోంది. జిల్లాలో మొత్తం 6,78,160 రేషన్ కార్డులు ఉండగా సరుకులు పంపిణీ చేసేందుకు 1392 రేషన్ షాపులు ఉన్నాయి. రేషన్ షాపులకు **వచ్చిన బియ్యం పది లేదా పదిహేను శాతం బియ్యం** మాత్రమే కార్డుదారులకు అందుతోంది. మిగిలిన బియ్యం మొత్తం కూటమినేతల దందాలకు డబ్బుగా మారుతోంది.

**అక్రమ రేషన్ బియ్యం పై జరిగిన దాడులు ఇలా...**

జూన్ 2024 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 180కి పైగా దాడులు జరగ్గా వాటిలో 4800 క్వింటాళ్ల పైగా బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ దాడుల్లో స్థానిక టీడీపీ నేత రేషన్ బియ్యం అప్పగించిన రైస్‌మిల్లర్‌కు సంబంధించిన మిల్లులో ఒంగోలు ఆర్‌డీఓ దాడి చేసి సుమారు 3 వేల బస్తాల బియ్యాన్ని పట్టుకున్నారు. ఆ దాడికి సంబంధించి కేసు నమోదు కాకుండా ఉండేలా స్థానిక పచ్చనేత తీవ్రమైన ప్రయత్నం చేసినట్లు సమాచారం. అయినా కొంత పరిమాణం తగ్గించి కేసు నమోదు చేయక తప్పలేదు అధికారులకు. ఈ దాడుల్లో గత ఏడాది జూన్ నెలలో మొత్తం 545 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకుని 6ఏ కేసులు నమోదు చేశారు. వాటిలో 4 రేషన్ షాపులు, 4 అక్రమ రవాణా వాహనాలు, 2 రైస్ మిల్లులు ఉన్నాయి. అదేవిధంగా ఆగస్టు నెలలో మొత్తం 953 క్వింటాళ్ల బియ్యం పట్టుకోగా దాడులు నిర్వహించిన వాటిలో 25 రేషన్ షాపులు, 5 అక్రమ రవాణా వాహనాలు, 1 రైస్ మిల్లు ఉంది. సెప్టెంబర్‌లో 1107 క్వింటాళ్ల బియ్యం పట్టుకుంటే వాటిలో 23 రేషన్ షాపులు, 2 రైస్ మిల్లులు ఉన్నాయి. అక్టోబర్ నెలలో 9 రేషన్ షాపులు, 6 అక్రమంగా బియ్యం తరలిస్తున్న వాహనాలపై దాడి చేసి 573 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. నవంబర్‌లో రైస్‌మిల్లుపై దాడి చేసి 800 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. అధికారికంగా చేసిన దాడుల్లో కోట్లాది రూపాయల విలువైన బియ్యం ఉంటే దాడులకు దొరకకుండా జిల్లా సరిహద్దులు దాటిన బియ్యం ఏ స్థాయిలో ఉంటుందో అర్థమవుతోంది.

**రేషన్ బియ్యం మాఫియా నెట్ వర్క్ ఇలా...**

తొలుత పేదల పంపిణీ కోసం రేషన్ షాపులకు వచ్చిన బియ్యాన్ని కార్డుదారుల సంఖ్యను బట్టి ఎండీయూ ఆపరేటర్ వాహనాలకు అందజేస్తారు. వాహనాల వద్ద సంబంధిత రేషన్ షాపుల డీలర్లు కూడా ఉంటారు. బియ్యం వద్దు అనుకునే వారికి కార్డుదారులకు కేజీ బియ్యం రూ.10 లెక్కన డబ్బులు అందజేస్తారు. అలా కార్డుదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని స్థానిక టీడీపీ నేత ఏర్పాటు చేసిన మిల్లరు, బ్రోకర్లు డీలర్లకు రూ.13 నుండి రూ.15 చెల్లించి మిల్లులకు తరలిస్తారు. మిల్లర్లకు ఉన్న డిమాండ్‌ను బట్టి వాటిని రీ సైకిల్ చేసి పక్క రాష్ట్రాలు, దేశాలకు కేజీ రూ.35 నుంచి రూ.50 వరకు విక్రయిస్తూ ఎగుమతి చేస్తుంటారు. ప్రతి నెలా జిల్లాలో పేదలకు పంపిణీ చేసే బియ్యంలో సుమారు 80 నుండి 90 శాతం బియ్యం రేషన్ మాఫియా పాలవుతోంది. రేషన్ షాపుల డీలర్లంతా పచ్చనేత సూచించిన మిల్లర్, బ్రోకర్లకు మాత్రమే పేదల బియ్యాన్ని ఇచ్చేలా ఒప్పందాలు చేశారు. ఆ మేరకు అమ్మిన పేదల బియ్యం తాలూకు డబ్బును స్థానిక పచ్చ నేతతో పాటు ఆయా డివిజన్‌లలోని చోటా నాయకులకు సైతం నెలవారీ మామూళ్లు ఇచ్చేలా ప్రణాళికలు రచించి అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# వైవీని కలిసిన బూచేపల్లి





రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఒంగోలులోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆయన్ను శాలువతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు కూడా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వారి వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర రావు, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి శాలువతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొట్ల రామారావు, ఆళ్ల రవీంద్రారెడ్డి, దుంపా చెంచిరెడ్డి, కె.వి.రమణారెడ్డి, రొండా అంజిరెడ్డి, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, కటారి ప్రసాద్, మీరావలి, కుట్టుబోయిన కోటి, పొలడుగు శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, కమ్మ సురేష్‌బాబు, 44 డివిజన్ అధ్యక్షుడు మాల్యాద్రిరెడ్డి, 21 డివిజన్ అధ్యక్షుడు రవిచంద్ర, 48 డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, పార్టీ నాయకులు బడుగు ఇందిర, భూమిరెడ్డి రమణమ్మ, పేరం ప్రసన్న, బొప్పరాజు జ్యోతి, వడ్లమూడి వాణి, మేరీ, మాధవి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# బరితెగించారు

- విచ్చలవిడిగా పేకాట, కోడి పందేలు
- రెచ్చిపోయిన బెట్టింగ్ బాబులు
- పండుగ ఆఫర్ ఇచ్చారంటున్న జూదరులు
- అధిష్టానం ఆదేశాలో, మామూళ్లమత్తో.. నిద్రనటించిన పోలీసులు
- పందేల్లో కోట్లాది రూపాయలు చేతుల మారిన వైనం
- వ్యాపారాలు డల్..పందేలు జోష్ అంటున్న ప్రజలు

టాస్క్‌ఫోర్స్, ఒంగోలు: కొండపి నియోజకవర్గంలో సంక్రాంతి పండుగను సందర్భంగా పేకాట, కోడిపందేలు జోరుగా సాగాయి. ఈ మూడు రోజుల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. ఇక్కడి కోడిపందేలు ఈసారి కోనసీమను తలపించాయి. మరోపక్క పేకాట కేంద్రాలు కూడా జోరుగా సాగాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు పండుగ కదా ఆడుకోనీలే అంటున్నారని.. ఇది పండుగ ఆఫరా.. లేక అధిష్టానం ఆదేశాలా.. లేక మామూళ్ల మత్తా అని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**హెచ్చరికలే తప్ప చర్యలేవీ..**

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు బనాయిస్తామని, కఠిన చర్యలు తప్పవని పోలీసులు పండుగకు వారంరోజుల నుంచి గ్రామాలలో మైకుల ద్వారా అనౌన్స్‌మెంటు చేస్తూ ఊదరగొట్టారు. పోలీసుల వారి మాటలకు అర్థాలే వేరులే అన్న చందంగా పండుగ మూడు రోజులూ పేకాట, కోడిపందేలు జోరుగా సాగాయి. భోగి రోజు కొంత బెరుగ్గా పందేలు ఆడామని, కానీ పోలీసులు ఆ ఛాయలకు రాకపోవటంతో మిగిలిన రెండు రోజులూ స్వేచ్ఛగా ఆడుకుంటూ ఎంజాయ్ చేశామని పందెంరాయళ్లు చెబుతున్నారు.

**జోరుగా కోడిపందేలు, పేకాట:**

నియోజకవర్గంలోని కొండపి మండలంలో పెట్లూరు, చిన్నకర్లగుంట, కొండపి, కట్టావారిపాలెం, జాళ్లపాలెం, నేతివారిపాలెం, అనకర్లపూడి, చోడవరం, టంగుటూరు మండలంలోని కొణిజేడు, జమ్ములపాలెం, టంగుటూరు, తూర్పునాయుడుపాలెం, తాళ్లపాలెం, సింగరాయకొండ మండలంలోని పాకల, ఊళ్లపాలెం, సోమరాజుపల్లి, కనుమళ్ల, శానంపూడి, కలికవాయ, జరుగుమల్లి మండలం ఎడ్లూరుపాడు, కామేపల్లి, పచ్చవ, పొన్నలూరు మండలం కే అగ్రహారం, విప్పగుంట, చౌటపాలెం, మాలపాడు, తిమ్మపాలెం, చెన్నిపాడు, మర్రిపూడి మండలం మర్రిపూడి, ధర్మవరం, కూచిపూడి, గుండ్లసముద్రం, శివరాయునిపేట, గార్లపేట, కాకర్ల, వేమవరం, అయ్యపురాజుపాలెం, జక్కరాజుపాలెం, నరసరాజుపాలెం గ్రామాలలో కోట్లాది రూపాయల కోడిపెందేలు, పేకాటలు జరిగాయి. ఒక్కో మండలంలో సుమారు రూ.2 కోట్లపైనే ఆట జరిగిందని బెట్టింగ్ రాయుళ్లే చెబుతున్నారు.



పాకల సముద్ర తీరంలో కోడిపందేల బరి వద్ద గుమిగూడిన జనం

**డ్రోన్‌లకు పని కల్పించారా..**

నూతన సాంకేతిక విధానంలో పందెం రాయుళ్ల ఆటకట్టిస్తాం.. దాతల సహకారంతో డ్రోన్‌లను సేకరించాం.. బెట్టింగ్ రాయుళ్ల పనిపడతాం.. 10 కిలోమీటర్ల దూరంలో ఏ మారుమూల ప్రాంతంలో పేకాట, కోడిపందేలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు ప్రగల్భాలు పలకటం తప్ప ఇంత జరుగుతున్నా ఒక్క కేసు నమోదు కాదు. ఒక్కరిని కూడా అదుపులోకి తీసుకున్న దాఖలాలు లేవు. అసలు దాతలు ఇచ్చిన డ్రోన్ కెమెరాలను పెట్టెల్లో నుంచి బయటక తీశారా అన్న అనుమానం కలుగుతుంది. ఒకవేళ పోలీసులు అరికడదామని పూనుకున్నా ప్రభుత్వ పెద్దల నుంచి పని చేయాలని ఉందా లేక బదిలీ చేయాలా అని హెచ్చరికలు జారీ చేశారా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మొత్తం మీద మామూళ్ల మత్తులో పోలీసుల అలసత్వమో లేక ప్రభుత్వ పెద్దల ఆదేశాలో ఏదేమైతేనేం పందేలు మాత్రం జోరుగా సాగాయి. బెట్టింగ్ బాబులు ఆనందంగా గడిపారు, ఆశావహులు డబ్బులు పోగొట్టుకున్నారు.

# గెలుపు ఓటములను సమానంగా భావించాలి

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా భావించి తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. టీసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం స్థానిక పుల్లలచెరువు రోడ్డులోని బృందావనం గార్డెన్స్ ఆవరణలో రెండో ఆట స్థలాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌కు మంచి స్పందన లభించిందని, వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం ఆనందంగా ఉందని, ఇటువంటి క్రీడలు మరెన్నో నిర్వహించుకుందామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.మజీద్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, గంటా వెంకటరమణారెడ్డి, పి.కృష్ణారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, వివిధ విభాగాల నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, ఆర్.అరుణాబాయి, సరళ, శారమ్మ, సూరె ప్రసాద్, పబ్బిశెట్టి శ్రీనివాస్, కృష్ణ, తమ్మినేని సత్యనారాయణరెడ్డి, ఆవుల కోటిరెడ్డి, ఆవుల చెంచిరెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, డి.నాగేశ్వరరెడ్డి, వి.బ్రహ్మానందరెడ్డి, వెన్నా శివకృష్ణారెడ్డి, షేక్.బుజ్జి, టి.ఆవులయ్య యాదవ్, సేనారెడ్డి, రామాంజనేయరెడ్డి, దోమకాళ్ల వెంకటేశ్వర్లు, షేక్.కాశిం, షేక్.వలి, జానకి రఘు, ఎల్.రాములు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

# విందు.. వినోదం

**భక్తి శ్రద్ధలతో సాగిన పార్వేట, రథోత్సవాలు**

కమనీయ జీవితానికి కనుమ పండగ నాంది కావాలని కాంక్షిస్తూ ఊరూవాడా సంబరాలు నిర్వహించారు. మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండగ సందర్భంగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. రంగవల్లుల పోటీల్లో ప్రతిభ చాటిన మహిళలకు బహుమతులు అందజేశారు. సూర్యుడి మకర రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో పార్వేట ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు.

**- సాక్షి నెట్‌వర్క్**


దర్శి కోదండరామాంజనేయస్వామి పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి


టంగుటూరు : వల్లూరు చెరువులో వల్లూరమ్మతల్లి తెప్పోత్సవం


ఒంగోలు : కొప్పోలులోని చెన్నకేశవస్వామి తెప్పోత్సవం


సీఎస్‌పురం : మిట్టపాలెంలో నారాయణస్వామి రథోత్సవం


ఒంగోలు నగరంలో పార్వేటలో హుషారుగా స్టెప్పులేస్తున్న డ్యాన్సర్లు


బేస్తవారిపేట : పందిళ్లపల్లెలో మహిళల కోలాట ప్రదర్శన


చీమకుర్తి : కేవీ అగ్రహారంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి రథోత్సవం


పొన్నలూరులో వైఎస్ జగన్ చిత్రంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రంగవల్లి


మార్కాపురంలో పార్వేటకు తరలుతున్న చెన్నకేశవస్వామి


కంభంలో ఉత్సవమూర్తుల పార్వేట


ఒంగోలులోని గాంధీ పార్కులో తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన నగరవాసులు


నాగులుప్పలపాడు : ఉప్పుగుండూరులో వేణుగోపాల స్వామి తెప్పోత్సవం


చీమకుర్తి : దేవరపాలెం హైస్కూల్ ప్రాంగణంలో ముగ్గుల పోటీ


పామూరులో వాసవీమాత ఆలయం వద్ద ముగ్గుల పోటీ

## సంక్షిప్తంగా

### కూతురి వరుస చిన్నారిపై లైంగిక దాడి

- గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ కార్యక్రమంలో బయటపెట్టిన విద్యార్థిని

**కురిచేడు:** సభ్యసమాజం తలదించుకునేలా ఒక మానవ మృగం కూతురు వరసైన ముక్కుపచ్చలారని చిన్నారిని చిదిమేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కురిచేడు మండలంలోని ఒక గ్రామంలో 4వ తరగతి చదువుతున్న ఓ చిన్నారిని తన సొంత పెద్దమ్మ భర్త.. చిన్నారి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. పాఠశాలలో వారం రోజుల క్రితం గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి గ్రామ పోలీసు, ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్న సమయంలో ఆ చిన్నారి తమ తరగతి ఉపాధ్యాయినికి విషయం చెప్పడంతో వారు తల్లిదండ్రులకు తెలియజేశారు. సొంత బంధువులు కావడంతో విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. కానీ ఈ విషయం ఆనోటా, ఈనోటా బయటకు పొక్కి ప్రచారం సాగుతోంది.

### విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతి చెందిన శివారెడ్డి

**పొదిలి రూరల్:** పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన పొదిలి మండలంలోని జువ్వలేరులో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెన్నపూస శివారెడ్డి(52) తన పొలంలో సాగు చేసిన మిరప తోటకు నీరు పెట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో వ్యవసాయ బోరు వద్ద ఉన్న 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. సంక్రాంతి పండగ రోజున కుటుంబ పెద్ద కన్నుమూయడంతో బంధుమిత్రులు బోరున విలపించారు. మృతుడు శివారెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. రైతు మృతి చెందిన సమాచారం తెలియడంతో విద్యుత్ శాఖ ఏడీఈ హరిబాబు, ఏఈ మోహన్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు తీగలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## మళ్లీ రెచ్చిపోయిన ‘రౌడీ’ చౌదరి

- గిరిజన యువకులపై దాడికి పాల్పడిన మన్నెం రామాంజనేయ చౌదరి
- ఆటోలో వెళ్తుండగా కారుతో వెంబడించి త్రోవగుంట వద్ద అటకాయించిన వైనం
- బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఉండగానే ఫోన్ చేసి చంపుతానంటూ బెదిరింపులు
- పోలీసులేమీ చేయలేరు, గోరంట్ల థియేటర్ వద్ద ఉన్నా.. దమ్ముంటే రండ్రా అంటూ సవాల్
- మోటా నవీన్ కేసులో ప్రధాన ముద్దాయి రామాంజనేయ చౌదరి

**ఒంగోలు టౌన్:** రెండేళ్ల క్రితం గిరిజన యువకుడు మోటా నవీన్‌పై దాడి చేసి, ముఖం మీద మూత్రం పోసిన కేసులో ప్రధాన ముద్దాయి మన్నెం రామాంజనేయ చౌదరి మళ్లీ రెచ్చిపోయాడు. బుధవారం ఇద్దరు గిరిజన యువకులపై దాడికి పాల్పడ్డాడు. బాధితుల కథనం ప్రకారం.. ఒంగోలు నగరంలోని శ్రీరామ్ కాలనీకి చెందిన గిరిజన యువకులు దేవరకొండ రాజ్ కుమార్, కుంబా రామ్‌కుమార్ కనుమ పండగ సందర్భంగా కోళ్లు కొనుగోలు చేసేందుకు ఆటోలో బయలుదేరి వెళ్తున్నారు. వారిని రామాంజనేయ చౌదరి అలియాస్ అంజి మరికొందరితో కలిసి కారులో వెంబడించాడు. త్రోవగుంట బ్రిడ్జి వద్దకు రాగానే ఆటోను అటకాయించి రాజ్ కుమార్, రామ్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో రక్త గాయలయ్యాయి. స్థానికులు రావడంతో నిందితులు పారిపోయారు. బాధితులను వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. తాలూకా ఎస్సై సందీప్ బాధితులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్న సమయంలోనే రామాంజనేయ చౌదరి ఫోన్ చేసి బెదిరించడం గమనార్హం. ‘నేను గోరంట్ల శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్నా, నీకు దమ్ముంటే రా, పోలీసులు ఏమి చేయలేరు, నీ అంతు తేలుస్తా’ అంటూ రాజ్ కుమార్‌ను సవాల్ చేసి బెదిరించాడు.

**తరచూ బెదిరింపులు**

రెండేళ్ల క్రితం ఒంగోలు నగర శివారులో మోటా నవీన్ అనే గిరిజన యువకుడిని చితకబాది, ముఖం మీద మూత్రం పోస్తూ వీడియో చిత్రీకరించిన కేసులో అంజి పరారయ్యాడు. అతడిని వెదికేందుకు పోలీసులు హైదరాబాద్ వెళ్లారు. అప్పుడు రాజ్ కుమార్ పోలీస్ కారుకు డ్రైవర్‌గా వెళ్లాడు. అది మనసులో ఉంచుకున్న అంజి ‘నిన్ను చంపుతారా’ అంటూ రాజ్ కుమార్‌కు తరచూ ఫోన్ చేసి అంజి బెదిరిస్తున్నాడు. ఈ క్రమంలోనే తమపై దాడికి పాల్పడినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అంజి పరారీలో ఉన్నట్లు తాలూకా సీఐ అజయ్ కుమార్ చెప్పారు.


విలేకరులతో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

**అంజిని కఠినంగా శిక్షించాలి**

అగ్రకుల దురహంకారంతో తరచుగా గిరిజన యువకులపై దాడులకు పాల్పడుతున్న రామాంజనేయ చౌదరి అలియాస్ అంజిని కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్ర రావు డిమాండ్ చేశారు. అంజి ముఠా దాడిలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గిరిజన యువకులను పరామర్శించారు. అనంతరం బాధితులతో కలిసి తాలూకా పోలీసు స్టేషన్ వద్ద మాట్లాడుతూ.. గంజాయి రౌడీ బ్యాచ్ ఆగడాలు ఎక్కువయ్యాయని చెప్పారు. పోలీస్‌స్టేషన్లో ఉండగానే బాధితులకు ఫోన్ చేసి బెదిరించడం, ‘ఫోన్ కట్ చేస్తే నిన్ను చంపుతా’ అని మెసేజ్ పెట్టడాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

## అనుమానంతోనే అంతమొందించాడు

- భార్య హత్య కేసులో భర్త అరెస్టు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగరాజు

**కంభం:** తన భార్య ఇతరులతో చనువుగా ఉంటుందన్న అనుమానంతో అర్థవీటి శివ రంగయ్య హత్యకు పాల్పడినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు పేర్కొన్నారు. ఈ నెల 12న కంభం పట్టణంలోని సాదుమియా వీధిలో నాగ అంజలి(40) అనే వివాహిత హత్యకు గురైన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ నాగరాజు కేసు వివరాలు వెల్లడించారు. నాగ అంజలి పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఆయాగా, ఆమె భర్త లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు కాగా అందరికీ వివాహాలయ్యాయి. ప్రైవేట్ స్కూల్లో పని చేస్తున్న తన భార్య ఇతరులతో చనువుగా ఉంటోందని అనుమానం పెంచుకున్న భర్త ఆమెను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. శనివారం రాత్రి భోజనం చేసి పడుకున్న తర్వాత అర్ధరాత్రి వేళ కర్రతో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మంగళవారం సాయంత్రం స్థానిక అంకాళమ్మ గుడి వద్ద శివ రంగయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. కేసును వేగంగా ఛేదించడంలో కృషి చేసిన సీఐ కె.మల్లికార్జున, ఎస్సై బి నరసింహారావులతోపాటు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య, కానిస్టేబుల్ బషీర్, పీరయ్యను డీఎస్పీ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

### 40 ఏకోపాధ్యాయ పాఠశాలలపై స్పష్టత ఇవ్వాలి

- డీఈఓను డిమాండ్ చేసిన టీచర్స్ గిల్డ్ నాయకులు

**ఒంగోలు సిటీ:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 40 ఏకోపాధ్యాయ పాఠశాలలపై డీఈఓ కిరణ్‌కుమార్ స్పష్టత ఇవ్వాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్.ప్రభాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ‘ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు ఒకే టీచరుతో అన్ని సబ్జెక్టుల బోధన జరుగుతోంది. 13 పాఠశాలల్లో అసలు పిల్లలే లేరు. 19 పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తి కన్నా ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉంది. టీచర్ సెలవు పెడితే ఎంఈఓలు సీఆర్పీ లేదా మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల’ని పేర్కొన్నారు. అలా కాకుండా కొంతమంది ఎంఈఓలు మీరే రోజు కూలీ ఇచ్చి వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పడం సరికాదన్నారు. జిల్లాలో మిగులుగా ఉన్న 150 మంది ఉపాధ్యాయులను శాశ్వతంగా సీనియార్టీ లిస్టు తయారీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపయోగించుకోవాలని కోరారు. కోర్టుకు వెళ్లిన యాజమాన్యాలకు ఉపాధ్యాయులను కేటాయించి ఇబ్బందులకు గురిచేయకుండా శాశ్వతంగా కౌన్సిలింగ్ నిర్వహించి సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు.